క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడియం: మండలంలోని మురమండలో ఉన్న శ్రీపిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఒక గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బీకే రామచౌదరి ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెస్సీ మేథ్స్ (కనీసం 50 శాతం మార్కులు) కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 18వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలన్నారు. 19న ఇంటర్వ్యూ అనంతరం ఎంపిక ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పారితోషికం చెల్లిస్తారన్నారు. వివరాలకు పని వేళల్లో కళాశాల కార్యాలయం వద్ద సంప్రదించాలని కోరారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

కడియం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్‌పాల్ డిమాండ్ చేశారు. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేశారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐఆర్, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ప్రసంగించిన వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు పి.రవికుమార్, డాక్టర్ టీవీ శ్రీధర్, డాక్టర్ ఎల్ మోహనవంశీ, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వివాహాలు


సామూహిక వివాహాల్లో ఒక్కటైన దంపతులు


సీటీఆర్ఐ: కొన్నేళ్లుగా స్థానిక సింహాచలనగర్‌లోని శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉచిత సామూహిక వివాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సామూహిక వివాహాలు వైభవంగా జరిగాయి. గుంటూరు జిల్లా మాచర్ల, విశాఖపట్నం, విజయనగరం జిల్లా కొండవర్తి, అడ్డతీగల, రంపచోడవరం, రావులపాలెం, పాలకొల్లు, బుట్టాయగూడెం, గంగవరం, ధర్మవరం, ధవళేశ్వరం, సీతానగరం మండలం రఘుదేవపురం, రాజవొమ్మంగి, గుప్పటిపేట, నర్సన్నపేట తదితర ప్రాంతాల నుంచి వధూవరులు హాజరయ్యారు. మొత్తం 17 జంటలకు అర్చక స్వామి అవసరాల కిరణ్ స్వామి శాస్త్రోక్తంగా వివాహాలు జరిపించారు. మంగళసూత్రం, మట్టెలు, మధుపర్కాలు, పూజా సామగ్రి అన్నీ ఆలయం తరపున సమకూర్చారు. విందు భోజనాలూ ఏర్పాటు చేశారు.

అల్లు బాబికి ధర్మాన పరామర్శ



అల్లు రాజేశ్వరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మాన ప్రసాదరావు తదితరులు


రాజమహేంద్రవరం సిటీ: మాతృ వియోగంతో బాధపడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వాధ్యక్షుడు అల్లు బాబిని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం పరామర్శించారు. ఇటీవల మరణించిన మాజీ కౌన్సిలర్ అల్లు రాజేశ్వరి చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, రాజమండ్రి వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాస్, కార్యదర్శి సప్పా వెంకటరమణ, వెలమ యువత అధ్యక్షుడు పి.బాబ్జీ, వెలమ ఉద్యోగుల సంఘ నాయకుడు ఎనిమిరెడ్డి సత్యనారాయణ, బండారు మధు, బోజంకి ఉమ, చింతల రామారావు తదితరులు ధర్మాన వెంట ఉన్నారు.

సినిమాలు



శ్యామల	:	వార్–2
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	వార్–2
స్వామి	:	కూలీ
అనుశ్రీ	:	కూలీ
శివజ్యోతి	:	కూలీ
రాజా	:	వార్–2
ఊర్వశి	:	కూలీ
మేనక	:	మహావతార్ నరసింహ
రంభ	:	వార్–2
అప్సర	:	వార్–2
అశోక	:	వార్–2
నామవరం		
వీఎస్ మహల్	:	కూలీ, వార్–2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కూలీ, వార్–2
కడియం		
వెంకటసూర్య	:	కూలీ, వార్–2





వివిధ రూపాల్లో మట్టితో రూపొందించిన వినాయక విగ్రహాలు


విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

ఏకో దంతాయనమః

- పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపయ్యలు సిద్ధం
- 12 అడుగుల వరకు విగ్రహాల తయారీ
- హానికర మెటీరియల్ వినియోగానికి స్వస్తి

రాజమహేంద్రవరం రూరల్: విఘ్నాలు తొలగించే వినాయకుడు చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాడు. ఇప్పటికే పలు చోట్ల మహాగణపతి కొలువయ్యాడు. ఇప్పటి వరకు పర్యావరణానికి హాని కలిగించే రీతిలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన బొజ్జ గణపయ్య విగ్రహాలు.. ఈసారి మాత్రం చాలా వరకు 'ఏకో' దంతులుగా రూపొందుతున్నాయి. పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టిన పలువురు విగ్రహ తయారీదారులు ఈసారి 'మృత్తికా గణపతిం' మనసాస్మరామి అంటున్నారు. స్వచ్ఛమైన బంక మట్టితోనే ఆ లంబోదరుడి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు.

జోరుగా విగ్రహాల తయారీ

అనేక ప్రాంతాల్లో ఈసారి మట్టి గణపతి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణపతి విగ్రహాలను తయారు చేసినప్పుడు మెర్క్యురీ, ఆర్గానిక్ లెడ్ క్రోమియం, ఆర్సనిక్ తదితర విష పదార్థాలతో కూడిన రసాయనాలను విరివిగా ఉపయోగిస్తున్నారు. అవి నీటిలో కలిసినప్పుడు జల కాలుష్యం ఏర్పడుతుంది. అలాంటి విగ్రహాలు నిమజ్జనం చేసినప్పుడు రసాయనాలు నీటిలో కరగవు. దీనివల్ల నీటిలో పెరిగే మొక్కలు, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. అంతేకాకుండా ప్రజలకు అనారోగ్య సమస్యలూ తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మట్టితో చేసినవే మేలు

కాలువ, గోదావరి మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు అవి త్వరగా కరిగిపోతాయి. నీటిలో ఉండే జలచరాలకూ ఎటువంటి హాని ఉండదు. వీటి తయారీలో ఎలాంటి రసాయనాలు వినియోగించకపోవడం వల్ల నీటి కాలుష్యం సమస్యే లేదు. దీంతో మట్టి విగ్రహాలతో పర్యావరణానికి కలుగుతున్న మేలును స్వచ్ఛంద సంస్థలతో పాటు, పాఠశాల విద్యార్థులూ బాధ్యతగా తీసుకుంటున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, నేషనల్ గ్రీన్‌కోర్ విద్యార్థులు మట్టి గణపతి వల్ల కలుగుతున్న మేలుతో పాటు, మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

తయారీ ఇలా..

కళాకారులు మొదట వెదురుతో వినాయక ప్రతిమ రూపొందిస్తున్నారు. ఆ తర్వాత దానికి గడ్డి చుట్టి, మట్టితో పూర్తి స్థాయి మెరుగులు దిద్దుతారు. సహజ సిద్ధమైన రంగులను అద్ది, కాలుష్య రహిత వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు.

పెరుగుతున్న డిమాండ్

కాలుష్య రహిత మట్టి విగ్రహాలనే వినియోగించాలని పర్యావరణ వేత్తలు, అధికారులు సూచిస్తుండడంతో వీటికి డిమాండ్ పెరిగింది. చవితి వేడుకల్లో మట్టి విగ్రహాలనే వినియోగించాలని ఇటీవల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉత్సవ కమిటీలు మట్టి విగ్రహాలకే ఆర్డర్లు ఇస్తున్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



వినాయక చవితి పండగ ఓ ప్రత్యేకత కలిగి ఉంది. మట్టి గణపతి విగ్రహాలకు ప్రతి ఒక్కరూ పూజలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాల మెటీరియల్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణం కాలుష్యమవుతుంది. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మట్టి విగ్రహాలనే వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలి.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్, తూర్పు గోదావరి

14 ఏళ్లుగా మట్టితోనే..



స్వచ్ఛమైన మట్టితోనే 14 ఏళ్లుగా వినాయక ప్రతిమలు రూపొందిస్తున్నాం. అడుగు నుంచి 12 అడుగుల వరకు అనేక రూపాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నాం. వీటికి నీటిలో కరిగే రంగులు మాత్రమే వాడుతున్నాం. గణపతి ఉత్సవ కమిటీలు మట్టి విగ్రహాల వినియోగానికే ఎక్కువగా మొగ్గుచూపుతున్నాయి.

– ఆర్.రాము, చిత్ర కళాకారుడు, సాయిగణపతి ఆర్ట్స్, మోరంపూడి

చిన్న ప్రతిమలు మేలు

- చిన్న సైజు ప్రతిమలను ఏర్పాటు చేస్తే నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తవు.
- బంక మట్టితో తయారైన విగ్రహాలను నిమజ్జనం చేస్తే త్వరగా నీటిలో కలసి పోతాయి.
- బంక మట్టి నీటి స్వచ్ఛతను పెంచేందుకు దోహదం చేస్తుంది.
- నిమజ్జనం సమయంలో చిన్న మట్టి విగ్రహాలు కరిగి నీటికి ఎటువంటి నష్టం కలుగజేయదు.
- పర్యావరణానికి మట్టి విగ్రహాలు ఎంతో ఉత్తమం.
- ఇళ్లలో చిన్న విగ్రహాలతో పాటు, మంటపాల్లో ప్రతిష్ఠించే భారీ విగ్రహాలనూ మట్టితో చేసినవే ఏర్పాటు చేయాలి.

వర్షం వస్తే.. అంతా మునకే..


నీట మునిగిన బొమ్మూరు-బాలాజీపేట రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: కాసింత వర్షం వస్తే చాలు.. బొమ్మూరు నుంచి బాలాజీపేటకు వెళ్లే రోడ్డులో శృతి హాస్పిటల్ సమీప ప్రాంతమంతా ముంపునకు గురవుతుంది. కొద్దిపాటి వర్షం వస్తే చాలు అర గంటలోపే ఆ ప్రాంతమంతా మునిగిపోతుంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఈ ప్రాంతం మునిగిపోతుందని వాహనచోదకులు వాపోతున్నారు. దీనివల్ల ముంపు సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ


విద్యార్థినికి మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ గురువారం అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల పిల్లలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన 57 మందికి స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన పిల్లలను అభినందించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి కష్టపడాలన్నారు. విజయవంతమైన వ్యక్తులుగా ఎదగాలని, ఉన్నత శిఖరాలు, లక్ష్యాలను సాధించాలన్నారు. సమాజానికి అనేక విధాలుగా సేవ చేయాలన్నారు. పిల్లలు కష్టపడి మంచి శాతం మార్కులు సాధించినందుకు పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఎల్.చెంచిరెడ్డి, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగరాజా స్కూల్‌లో..

స్థానిక విద్యానగర్‌లోని నాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెనరా బ్యాంక్ కోరుకొండ రోడ్డు బ్రాంచ్ సౌజన్యంతో విద్యాశక్తి పథకంలో గురువారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు రూ.3 వేలు, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.5 వేల చొప్పున బ్రాంచ్ మేనేజర్ గణపతి స్కాలర్‌షిప్‌లను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.చక్రధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం


ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ప్రముఖులు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని పోస్టాఫీసు వీధిలో ఉన్న లక్ష్మీగణపతి స్వామివారి ఆలయం వద్ద ఈ నెల 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం రాట ముహూర్తం చేశారు. ప్రతి ఏటా ఇక్కడ చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. ఇదిలాఉండగా రాట ముహూర్తం కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సహకార సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, స్థానిక నాయకులు సాకా సురేష్, ఉప్పులూరి భూషణం, పొన్న బాల, ఉప్పులూరి హనుమంతరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు, వంగపండు గణేష్, వెంకటేష్, పాపారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ముఖ్య నేతల పర్యటన

ప్రకాశం నగర్: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత ప్రాంతాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ పర్యటించనున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పార్టీ నేతలు బేబీ, జాన్ బ్రిట్టాస్ శనివారం ఉదయం 11 గంటలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి దేవీపట్నం మండలంలోని నిర్వాసిత గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. అలాగే 17వ తేదీన చింతూరు మండలంలోని నిర్వాసిత కాలనీల్లో పర్యటిస్తారని తెలిపారు.

పన్ను వసూళ్లు నూరు శాతం చేయాలి

కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ వెంకటరమణ

సీటీఆర్ఐ: అస్తి పన్ను వసూళ్లు నగరపాలక సంస్థకు ప్రధాన ఆదాయవనరు అని, పన్ను వసూళ్లు నూరు శాతం సాధించాలని కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్ హాలులో రెవెన్యూ విభాగం అధికారులు, పరిపాలన కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ప్రతి ఇంటికి అస్తి పన్ను విధిగా ఉండాలన్నారు. సచివాలయ పరిపాలన కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటిని పరిశీలించి, అండర్ అసెస్‌మెంట్, అన్ అసెస్‌మెంట్, ఖాళీ స్థలాలకు పన్నులు విధించాలన్నారు. పన్ను విధించడానికి అవసరమైన పత్రాలు ఇవ్వని ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. పన్ను విధించాల్సిన ఇళ్లతో పాటు, పన్ను పెంచాల్సిన ఇళ్లను కూడా గుర్తించాలని సూచించారు. బేస్ రిజిస్టర్ ఆధారంగా డిమాండ్ నోటీసులు ఇచ్చేటప్పుడు ఇళ్లకు పన్ను పెంచాల్సిన అవసరం ఉన్నదీ, లేనిదీ గుర్తించాలన్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో గుర్తించిన ఇళ్లకు వెంటనే పన్నులు విధించాలని ఆదేశించారు. ఇన్‌చార్జి అడ్మిన్ సెక్రటరీలు ఉన్న చోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి తగిన విధంగా దిశానిర్దేశం చేయాలన్నారు. అలాగే ప్రతి రోజు సర్వే, పన్ను విధింపు పురోగతిపై నివేదికలను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనికి వెళ్తున్నానని చెప్పి.. వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంట్లో పనికి వెళ్తున్నట్టు చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైనట్టు అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతను బంధువుకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పినట్టు తెలియడంతో, భార్యతో పాటు బంధువులు అతడి కోసం గాలిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం, కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన 34 ఏళ్ల గళం వీరబాబు కుటుంబం ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చి దివాన్‌చెరువులో ఉంటోంది. అప్పటి నుంచి భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. బుధవారం ఉదయం వీరబాబుకు అతని భార్య వీరమణి ఫోన్ చేసినప్పుడు గాడాలకు పనికి వెళ్లానని, బిజీగా ఉన్నానని తెలిపాడు. అయితే కాకినాడలో ఉన్న బంధువు రామకృష్ణకు వీరబాబు ఫోన్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి మొబైల్ స్విచాఫ్ చేశాడు. అప్పటి నుంచి తెలిసిన చోట్ల వెతికినా వీరబాబు ఆచూకీ లభించలేదు. ఈ మేరకు వీరమణి గురువారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరంతా కుండపోత

- రహదారులు జలమయం
- స్తంభించిన జన జీవనం
- ప్రయాణికులు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు


ముంపునకు గురైన శ్రీరామపురం రోడ్డు


జాతీయ రహదారిపై రాజానగరం వద్ద..

రాజానగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై కాలువలను తలపించే స్థాయిలో వర్షపు నీరు ప్రవహించింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రయాణికులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముంపులో శ్రీరామపురం రోడ్డు

కుండపోత వర్షంతో మండలంలోని దివాన్‌చెరువు కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డు జంక్షన్ పూర్తిగా ముంపునకు గురైంది. మోకాలు లోతున వర్షపు నీరు నిలిచిపోవటంతో స్థానికులతో పాటు, ఆ రోడ్డుపై రాకపోకలు సాగించిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు వేసి, ఇరువైపులా పక్కా డ్రైన్లు ఏర్పాటు చేసినప్పటికీ, పల్లపు ప్రాంతాన్ని ఎత్తు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ఇక్కడ ముంపు పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని కానవరం, రాధేయపాలెం, తుంగపాడు, నరేంద్రపురం, కలవచర్ల, సూర్యారావుపేట రోడ్లపై కూడా వర్షపు నీరు భారీగా ప్రవహించింది.

పల్లపు ప్రాంతాలు జలమయం

రంగంపేట: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కాస్తంత ఎండ, ఉక్కపోత ఉన్నప్పటికీ, మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల నుంచి ఐదు గంటల వరకూ దఫదఫాలుగా వర్షం కురవడంతో గ్రామాల్లోని వీధులన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. పాఠశాలలు, కాలేజీలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడీబీ రోడ్డులో ద్విచక్ర వాహనదారులు వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయారు. ఈ వర్షం మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలోని పలు రకాల పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. వరి, మినుము పంటలతో పాటు, పామాయిల్, మొక్కజొన్న, పండ్లతోటలు, కూరగాయ పంటలకు మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.